క్లుప్తంగా

నిత్యన్నదాన పథకానికి సహకారం



పథకం నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాత విటల్‌సాయిప్రసాద్

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకానికి స్థానిక వ్యాపారి సూరు సాయివిటల్ ప్రసాద్ రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. శనివారం ఆయన తన నివాసంలో లయన్స్ క్లబ్ శాశ్వత అన్నదాన పథకం నిర్వాహకులు ఎస్.సన్యాసిరావుకు నగదు అందజేశారు. సన్యాసిరావు మాట్లాడుతూ దాతల సహకారంతో పదేళ్లుగా అన్నదాన పథకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి ఆదరణ లేని వారికి రోజూ మధ్యాహ్నం భోజనం అందజేస్తున్నామని స్పష్టం చేశారు. కింతలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో డీఈఓ తనిఖీలు



పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయించాలని హెచ్ఎం సుదర్శనరావుకు సూచించారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

కొత్తవలస: మండల పీఆర్టీయూ శాఖ నూతన కార్యవర్గం ఎన్నికను స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా పి.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.బ్రహ్మాజీ, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.శంకర్, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటరావు, మహిళా విభాగం ఉపాధ్యక్షు రాలుగా జి.శ్రీదేవి, కార్యదర్శులుగా ఐ.ఎస్.ఎన్.రవికుమార్, బి.రవికుమార్, మహిళా కార్యదర్శిగా సుధా నిర్మల, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.నాగభూషణం, ఎం.అప్పలరాజు, జె.వి.సన్యాసిరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.ఈశ్వర్రావు వ్యవహరించారు. నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి బండారు మోహన్‌రావు ప్రమాణస్వీకారం చేయించారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ విమలమ్మ

మెంటాడ(గజపతినగరం రూరల్): విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని, ప్రతి ఒక్కరికీ కచ్చితంగా చదవడం, రాయడం నేర్పించా లని ఎంఈఓ వి.విమలమ్మ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని తమ్మారాయుడుపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆమె తనిఖీలు నిర్వ హించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించి అన్ని రికార్డులు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. ఆమె వెంట ఎంఈఓ-2 సాయిచక్రధర్ ఉన్నారు.

వ్యాధిగ్రస్తులకు అండగా గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్



మెడికవర్ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న రక్తదాతలు

విజయనగరం ఫోర్ట్: గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు అండగా నిలుస్తున్నారు. గుండె శస్త్రచికిత్సల చేయడానికి అవసరమైన రక్తాన్ని క్లబ్ తరఫున అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2012 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 1002 గుండె శస్త్రచికిత్సలు జరగ్గా.. 899 శస్త్రచికిత్సలకు అవసరమైన రక్తాన్ని క్లబ్ సభ్యులు అందజేశారు. తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో పార్వతీపురానికి చెందిన జి.రామినాయుడుకు గుండె శస్త్రచికిత్స జరగనున్న నేపథ్యంలో క్లబ్ సభ్యులు శనివారం రక్తదానం చేశారు. దీంతో పలువురు క్లబ్ సభ్యులను అభినందించారు.

ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం

- ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం
- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మిచాంగ్ తుఫాన్ వర్షాలకు తడిసి రంగుమారిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు గజపతి నగరం నియోజకవర్గంలో సుమారు 15వేల ఎకరాల్లో వరి కుప్పలు నీట మునిగాయని, మరో 500 ఎకరాల్లో కోతలు చేయకుండా ఉన్న వరిచేను నేలకొరిగి నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలు అందజేశారని స్పష్టం చేశారు. నష్ట పోయిన రైతులందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారు. పెసర, మినుమ, మొక్కజొ న్న పంటలు నష్టపోయిన రైతులకు రబీ సీజన్‌లో సబ్సిడీపై ప్రభు త్వం విత్తనాలను సరఫరా చేస్తుందని తెలిపారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహ న్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా ఉంటున్నారన్నారు.

రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది

రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు మిల్లర్లు, పీఏసీఎస్‌ల ద్వారా 45 వేల గోనె సంచులను సిద్ధం చేయించామని ఎమ్మెల్యే చెప్పారు. ఒకవేల రైతులే సొంతంగా గోనె సంచులు సమకూర్చుకుంటే వాటి కయ్యే ఖర్చును వారి ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు. అలాగే ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా మిల్లులకు ధాన్యం తరలించేందుకు అయ్యే రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ధాన్యం సాధారణ రకం క్వింటాల్ మద్దతు ధర రూ.2,183, ఏ-గ్రేడు రకం రూ.2,203కు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవడం లేదని, అభివృద్ధి చేయడం లేదంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.ఏ.నాయుడు, ఆ పార్టీ నాయకులు అర్థం లేని మాటలతో దుష్ప్రచారం చేస్తున్నారని, ఆ పార్టీ నాయకులకు మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. టీడీపీ నాయకులు ప్రతి అంశాన్నీ రాజకీయ లబ్ధికోసం వాడు కోవాలని చూస్తున్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. ఏడీఏ కె.మహరాజన్, పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, జెడ్పీటీసీ గార తవుడు, స్థానిక ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సీఎస్‌డీటీ రవిశంకర్, ఏఓ ధనలక్ష్మి, డీటీ సత్యనారాయణ, సబ్ డివిజనల్ సహకార అధికారి ఎం.వాణీశైలజ, పీఏసీఎస్ సీఈఓ నారాయణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, నాయకులు బెల్లాన త్రినాథరావు,మండల సురేష్, రేగ గోవింద, కె.పైడిపునాయుడు, కె.రామునాయుడు ,కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

జామి: మండలంలో పుష్పగిరి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణి హరం సీతారామాచార్యులు స్వామివారిని తులసీదళాల మాలలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానఅర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి



భీమసింగిలో వేంకటేశ్వరస్వామికి తులసీదళాలతో పూజచేస్తున్న అర్చకులు

రాజీయే రాజమార్గం



గజపతినగరం కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి కనకలక్ష్మి



చీపురుపల్లి కోర్టు హాలులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి విజయరామేశ్వరి



కొత్తవలస కోర్టు వద్ద మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర



శృంగవరపుకోట కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి వాణి

గజపతినగరం/కొత్తవలస/శృంగవరపుకోట/ చీపురుపల్లి: కేసులను పరిష్కరించుకునేందుకు రాజీయే రాజమార్గమని కక్షిదారులు గుర్తుంచుకోవాలని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి, కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర, ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి, చీపురుపల్లి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం.విజయరామేశ్వరి అన్నారు. ఆయా కోర్టుల్లో శనివారం జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. గజపతినగరం కోర్టులో సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులు 143, చీపురుపల్లి కోర్టులో 117, కొత్తవలస కోర్టులో 38, ఎస్.కోట కోర్టులో 45 కేసులు పరిష్కరించారు. ఈసందర్భంగా న్యాయమూర్తు లు మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్ ద్వారా కేసులకు సత్వరన్యాయం లభిస్తుందని అన్నారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే 'గడప గడపకు'



ముషిడిపల్లిలో ఓ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకూ వస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం 'గడప గడప కు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా చేకూ రిన లబ్ధిని ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసంద ర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు.గ్రామాల్లో తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు, మౌలిక వసతుల కల్పనకు ప్రతీ సచివాలయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 20 లక్ష లు మంజూరు చేస్తున్నారన్నారు. అవినీతి రహిత, పారదర్శక, సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్య క్షుడు మోపాడ కుమార్, మండల జేసీఎస్ ఇన్‌చార్జి వాకాడ సతీష్, నాయకులు వాకాడ రాంబాబు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అదృశ్యమైన కార్మికుడి మృతదేహం లభ్యం



భాను(ఫైల్)

ఉక్కునగరం: అదృశ్యమైన స్టీల్‌ప్లాంట్ టీపీపీ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడి మృతదేహం లభ్యమైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలలు.. టీపీపీ విభాగంలో పనిచేస్తున్న ఆడారి భాను(28) ఈ నెల 6వ తేదీ విధులకు వెళ్లి.. ఆ రోజు మధ్యాహ్నం నుంచి కనిపించలేదు. స్టీల్‌ప్లాంట్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, కాల్ డేటా ఇలా అన్ని రకాలుగా ప్రయత్నించినప్పటికీ ఆచూకీ లభించలేదు. విభాగం సమీపంలోని డ్రెయిన్ నుంచి శనివారం దుర్వాసన రావడంతో అతని సహ కార్మికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి ఫిట్స్ ఉండటంతో దాని వల్ల డ్రెయిన్‌లో పడి మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ స్వామినాయుడు పర్యవేక్షణలో డ్రెయిన్ నుంచి మృతదేహాన్ని బయటకు తీసి.. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్.కోటకు చెందిన భాను పెదగంట్యాడలో స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కుమారుడి మరణంతో అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



చీపురుపల్లిరూరల్: కర్లాం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



చీపురుపల్లిరూరల్: గరివిడి మండలం రేగటిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు



కొత్తవలస: వీరభద్రపురంలో ఇంటింట ప్రచారం చేస్తున్న కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు, నాయకులు



లక్కవరపుకోట: నీలకంఠాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు

చీపురుపల్లిరూరల్: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మండలంలోని కర్లాం గ్రామ సచివాల యం పరిధిలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సచివాలయం వద్ద జెడ్పీ చైర్మన్, ఎంపీ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అలాగే గరివిడి మండలం రేగటి గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని మండల నాయకులు నిర్వహించారు.

ఇంటింట ప్రచారం

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులకు ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు.

లక్కవరపుకోట: మండలంలోని రేగ సచివాలయం పరిధి పెదిరెడ్లపాలెం,నీలకంఠాపురం గ్రామాల్లో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అధికారులు, నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటంట ప్రచారం చేశారు.

నేడు శిష్టకరణాల కార్తీక వనసమారాధన

చీపురుపల్లి: మండల శిష్టకరణ సంక్షేమ సేవా సంఘం కార్తీక వనసమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లావేరురోడ్‌లో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలోని తోటలో వనభోజనాలు ఉంటా యని పేర్కొన్నారు. మండలంలోని శిష్టకరణం సామాజిక వర్గం అంతా కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



హెచ్ఎం ఆచార్యులకు ప్రింటర్ అందజేస్తున్న గణిత ఉపాధ్యాయుడు రామకృష్ణ

మెరకముడిదాం: గర్భాం ఉన్నతపాఠశాలకు ఆ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు జి.రామకృష్ణ, ఆయన వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు కలిసి శనివారం రూ.16 వేల విలువైన ప్రింటర్‌ను అందజేశారు. హెచ్ఎం ఎస్.ఎస్.ఆర్.ఆచార్యులు ఉపాధ్యాయుడు రామ్మకృష్ణ, ఆయన శిష్యులను అభినందించారు.

నోట్ పుస్తకాలు, గైడ్‌ల పంపిణీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు పంచాయతీ రిక్షా కాలనీ క్రీస్తు సంఘం చర్చి పరిధిలో ఉన్న 65 మంది పేద విద్యార్థులకు రిలీఫ్ రెస్క్యూ, రీస్టోర్ చారిటబల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆల్‌ఇన్‌వన్ గైడ్‌లు, నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, పలకలు తదితర విద్యాసామగ్రి శనివారం అందజేశారు. పేద విద్యార్థులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ట్రస్టు ఏర్పాటు చేశామని రిలీఫ్ రెస్క్యూ, రీస్టోర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సత్తాల పైడితల్లి, శ్యామ్‌సన్, ఎస్.సైమన్, లక్ష్మి తెలిపారు స్థానిక నాయకులు గేదెల ఆదినారాయణ, గవిడి సన్యాసిరావు, మురళీధర్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిస్తున్న వారికి సంక్రాంతి పురస్కారాలను అందజేస్తున్నట్టు సర్వేజనా సుఖినోభవంతు సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో 2024 జనవరి 7న పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమాజ సేవ, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, విద్య, వైద్యం, యోగా, కరాటే, మెమరీ పవర్ వంటి వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వారందరూ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.


పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణ

చీపురుపల్లి: జ్ఞానసముపార్జనకు పుస్తకపఠనం ఎంతో దోహదపడుతుందని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. పట్టణంలోని సత్యరామ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆశయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మొబైల్ బుక్ లైబ్రరీ ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకపఠనం అలవాటు ఉన్న వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయాత్మకశక్తి ఉంటుందని వైద్యుల పరిశోధనల్లో వెల్లడయ్యిందన్నారు. అంతేకాకుండా ఒత్తిడి ఎదుర్కొనే శక్తి కూడా పుస్తకపఠనం ద్వారా అలవడుతుందన్నారు. అందుకనే విద్యార్థులు పుస్తకపఠనం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఆకళాశాల ఎస్ఎస్ఎస్ పీఓ ముకుందరావు, అధ్యాపకుడు ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు చప్టాను విరగ్గొట్టారని రైతుల ఫిర్యాదు



చప్టాను విరగ్గొట్టడంతో వృథాగా పోతున్న సాగునీరు

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేట గ్రామ సమీపంలోని కిత్తన్నచెరువు చప్టాను ధ్వంసం చేసిన వ్యక్తులపై ఎల్.కోట పోలీసులకు స్థానిక రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు పూర్తిస్థాయిలో నిండింది. చెరువు గర్భంలో సాగుచేసిన పంట పొలాల్లో నీరు చేరింది. చెరువు నీరు వేగంగా తరిగిపోయేందుకు వేపాడ మండలం శింగరాయి గ్రామానికి చెందిన సన్యాసయ్య, చందులూరు గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు కలిసి చెరువు రాతి చప్టాను విరగ్గొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నీరు వృథాగా పోతోందని, వేసవిలో పశువులకు నీటి ఇబ్బందులు తప్పవంటూ రైతులు వాపోతున్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



జామి: గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి



బొండపల్లి: గర్భిణులకు భోజనం అందజేస్తున్న వైద్యాధికారి సత్యనారాయణ, సృతసాయి సేవా సమితి సభ్యులు

జామి: గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి సూచించారు. పీహెచ్ సీ లో గర్భి ణులకు శనివారం ఆమె వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, హైరిస్క్ గర్భిణులు ఆరోగ్య జాగ్ర త్తలు పాటించాలని చెప్పారు. అనంతరం ఆస్పత్రి వచ్చిన గర్భి ణులు, వారి సహాయకులకు దాతలు పి.కిర ణ్‌కుమార్, కల్యాణి దంపతులు ఉచితంగా భోజనాలు అందజేశారు. దాతను వైద్యాధికారి అభినందించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, సీహెచ్ఓ ఫ్లొరెన్స్, హెచ్‌వీ భవాని, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

బొండపల్లిలో..

బొండపల్లి: స్థానిక పీహెచ్‌సీలో 40 మంది గర్భిణులకు వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ శనివారం వైద్యపరీక్షలు చేశారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను గర్భిణులకు వివరించారు. అనంతరం సృతసాయి సేవా సమితి సభ్యులు గర్భిణులకు భోజనాలు అందజేశారు. సీహెచ్ఓ రాజ్‌గోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఎ.భాషా, పీహెచ్ఎన్ రోజారమణి, గోపి తదితరులు పాల్గొన్నారు.

బీమా, పీఎంఈజీపీ చెక్కుల పంపిణీ



పీఎంఈజీపీ చెక్కులు అందజేస్తున్న ఏపీజీవీబీ అధికారులు

వేపాడ: 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా మండలంలోని వీలుపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద గ్రామీణ వికాస్ బ్యాంకు వారు పలువురికి బీమా,రుణాల చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కృష్ణారాయుడుపేట గ్రామానికి చెందిన దాలిబోయిన చినకృష్ణ, వల్లంపూడి చెందిన నరవ మాధవి ఏపీజీవీబీలో బీమా చేయించుకున్నారు. వారు మరణించడంతో రూ. 2లక్షల చొప్పున బీమా మంజూరైంది. మృతుల కుటుంబ సభ్యులకు వేపాడ ఏపీజీవీబీ బీఎం జనార్దన్, ఫీల్డ్ ఆఫీసర్ శోభన్‌బాబు, క్యాషియర్ చంద్రబాబునాయుడు చెక్కులు అందజేశారు. అలాగే పీఎంఈజీపీ పథకానికి కు సంబంధించి లబ్ధిదారులకు రూ. 5 లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో చానల్ మేనేజర్ మాధవరావు, సీఎస్‌పీలు పాల్గొన్నారు.